క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలపై విచారణ జరపాలని ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని యువజన కాంగ్రెస్ నాయకుడు టీకుల శ్రావణ్ మంగళవారం పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరికీ ఫిర్యాదు చేశారు. మండల పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని నాలుగు నెలల నుంచి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనలేదని, దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

భూమి ఇప్పించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న బాధితులు

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు దళితులు భూమి ఇప్పించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన ఎడమ రాజగోపాల్‌రెడ్డి, ఎడమ వెంకటరమణారెడ్డి 338 సర్వే నంబరులోని భూమి తమదేనంటూ ఇబ్బంది పెడుతున్నారని గ్రామానికి చెందిన చంద్రయ్య, పుష్ప, భూలక్ష్మి, లచ్చమ్మ, మధునమ్మ, లచ్చయ్య, పోచయ్య వినతిపత్రంలో తెలిపారు. తమకు 60 ఏళ్ల క్రితం సాదాబైనామా ద్వారా భూమి వచ్చిందని దీనికి సంబంధించిన కాగితాలు ధ్వంసకావడంతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్నగ్రామస్తులు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో మంగళవారం మట్టిటిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని ఓరైతు భూమిలోని మట్టిని పెట్రోల్ బంక్ కోసం తరలిస్తున్నారు. వెన్నంపల్లి రోడ్డు నుంచి వస్తున్న టిప్పర్లతో దుమ్ములేచి ఇబ్బందులు పడుతున్నామని, రోడ్డుపై దుమ్ము లేవకుండా నీళ్లు చల్లాలని సమీపంలోని ఇళ్ల యజమానులు సూచించారు. నీరు చల్లకుండా మట్టి తరలిస్తుండటంతో సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్యతోపాటు మరికొంతమంది ఆందోళన చేపట్టారు. అనంతరం ట్యాంకర్‌తో నీరు చల్లించడంతో శాంతించారు.

కారు అద్దాలు ధ్వంసం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం రేణుకా ఎల్లమ్మజాతరలో ఓ కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. జాతరకు గ్రామస్తులు వారి బంధువులు వివిధ ప్రాంతాల నుంచి తరలిరావడంతో జాతరప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. గోదావరిఖనికి చెందిన ఓ వ్యక్తి కారు ఢీ కొనడంతో భక్తురాలికి స్వల్ప గాయాలయ్యాయి. ఆమె బంధువులు కారుపై దాడి చేశారు. సమాచారం అందుకున్న కేశవపట్నం పోలీసులు ఆలయానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

ఇంటింటా సర్వే

మానకొండూర్: మండలంలోని గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా నీటిపై అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ కార్యదర్శులు మంగళవారం సర్వే చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ నల్లా కనెక్షన్ వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడు చేశారు. రోజు వచ్చే నీళ్లు, ఎన్ని గృహాలకు నల్లా కనెక్షన్ లేదు, కొత్తగా ఎన్ని గృహాలకు నల్లా కనెక్షన్ అవసరం ఉందనే వివరాలు సేకరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ కార్యదర్శులతో పాటు గ్రామైఖ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఈటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వాలి

వీణవంక: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వాలని మండలంలోని మైనార్టీ నాయకుడు అఖిల్ పాషా అన్నారు. మండలంలోని చల్లూరు గ్రామంలో మాట్లాడారు. ఈటలకు అధ్యక్ష పదవి ఇస్తే ముస్లింలు బీజేపీ వైపు రావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అందరిని సమన్వయం చేసుకుంటూ బీజేపీని బలోపేతం ఈటలకే సాధ్యమవుతుందని కేంద్రంలోని నాయకులు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

కౌంటర్లు ఆరుకు పెంపు

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజాపాలన సవరణ దరఖాస్తుల స్వీకరణకు నగరపాలక సంస్థ కార్యాలయంలో కౌంటర్లను పెంచారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సోమవారం నుంచి తిరిగి ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించి తలెత్తిన సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తులు తీసుకొంటుండడం తెలిసిందే. మొదటి రోజు కేవలం రెండు కౌంటర్లు ఉండడం, చాలా రోజుల తర్వాత దరఖాస్తుదారులు అధిక సంఖ్యలో రావడంతో రద్దీతో ఇబ్బందులు ఎదురయ్యాయి. నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం కౌంటర్ల సంఖ్యను రెండు నుంచి ఆరుకు పెంచారు. దీంతో పాటు కార్పొరేటర్ల కోరిక మేరకు డివిజన్‌లలోనూ ఈ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

నైపుణ్య శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

- కరీంనగర్‌లో టీటీసీ శిక్షణ
- వివిధ అంశాల్లో మెలకువలు
- 25 మంది నిపుణులతో తర్ఫీదు



తాము తయారు చేసిన వస్తువులు చూపుతున్న అభ్యర్థులు



అభ్యర్థులు గీసిన వివిధ రకాల డ్రాయింగ్స్



తయారు చేసిన వివిధ రకాల వస్తువులు

కరీంనగర్‌కల్చరల్: విద్యాశాఖ ఆధ్వర్యంలో టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (టీటీసీ) కోర్సులో భాగంగా డ్రాయింగ్, మ్యూజిక్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ వంటి కోర్సుల్లో నిపుణులైన శిక్షకుల ప్రత్యేక పర్యవేక్షణలో శిక్షణ తీసుకొని వారి జీవనోపాధికి మార్గం చూసుకుంటున్నారు పలువురు అభ్యర్థులు. డ్రాయింగ్‌లో స్టోన్, వాల్, వుడ్ పెయింటింగ్‌లో మెలకువలు నేర్చుకుంటూ.. టైలరింగ్‌లో మంచి నైపుణ్యాలు సాధిస్తూ.. ఎంబ్రాయిడరీలో పనికి రాని వస్తువులతో పలు అందమైన ఆకృతులను తయారు చేస్తున్నారు. కరీంనగర్‌లోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో టీటీసీ (టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్) కోర్సు నేర్చుకుంటున్నారు. మే 1న ప్రారంభమైన శిక్షణ ఈనెల 13 వరకు కొనసాగుతుంది. శిక్షణ అనంతరం వీరికి జూలై లేదా ఆగస్టులో రాత పరీక్షలు నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ, గురుకులంలో వృత్తి విద్యా కోర్సులో టీటీసీ పూర్తి చేసిన వారు కాంట్రాక్ట్, ప్రభుత్వ ఉద్యోగులకు అర్హులు. ఈ కోర్సులో శిక్షణ పొందుతున్న వారిలో 85శాతం మంది మహిళలు ఉన్నారు. 14 జిల్లాల నుంచి 590 మంది శిక్షణ పొందుతుండగా.. అందులో టైలరింగ్‌లో 313 మంది, డ్రాయింగ్‌లో 267 మంది, మ్యూజిక్‌లో 10 మంది తర్ఫీదు పొందుతున్నారు. శిక్షణ పొందుతున్న పలువురిని 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

పిల్లలకు ఎలా నేర్పించాలో తెలిసింది



ఇక్కడికి రాక ముందు డ్రాయింగ్‌లో బేసిక్స్ మాత్రమే తెలిసింది. టీచర్ల పర్యవేక్షణలో మెలకువలు నేర్చుకున్న. పెయింటింగ్స్ ఎలా వేయాలి, పిల్లలకు ఎలా నేర్పించాలో చెప్పారు. వుడ్, స్టోన్, ప్రకృతి, స్పెషల్ వర్క్ వాటిలో నైపుణ్యం సాధించా. ఎంత ఓపిక ఉంటే అంత బాగా నేర్చుకోవచ్చనే విషయం తెలిసింది. – జి.మేఘన, గోదావరిఖని

టైలరింగ్‌లో మెలకువలు నేర్చుకున్న



టైలరింగ్, ఎంబ్రాడయిరీలలో అన్ని రకాల మెలకువలు నేర్చుకున్న. పిల్లలకు ఎలా చెప్పాలో వివరంగా నేర్పించారు. మాస్టర్ చాలా ఓపికతో ప్రతీ విషయాన్ని అర్థమయ్యేలా బోధించారు. శిక్షణ శిబిరం మాకు ఎంతో ఉపయోగపడింది. మా జీవనోపాధికి మార్గం ఏర్పడింది. – లావణ్య, మంచిర్యాల

గ్రూపు-2, 3 పోస్టులు పెంచాలి

- ముఖ్యమంత్రికి రేవంత్‌రెడ్డికి చొప్పదండి ఎమ్మెల్యే సత్యం వినతి



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని, చాలా కాలం తర్వాత వచ్చిన గ్రూపు-2, 3 నోటిఫికేషన్లలో పోస్టుల సంఖ్య పెంచాలని కోరుతూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. టెట్ పరీక్ష నార్మలైజేషన్, డీఎస్సీ పరీక్షను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

మానకొండూర్: నేషనల్ హైవే పనుల్లో భాగంగా మండలంలోని చెంజర్ల విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలోని ఈదులగట్టేపల్లి, చెంజర్ల, ఖాదర్‌గూడెం గ్రామాలకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ ఎం. రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సర్కార్ స్కూళ్లలో సకల వసతులు



శ్రీరాములపల్లి గ్రామంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుల సదానందం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు గూర్చి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలను సర్కార్ స్కూళ్లలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, సంతోష్, రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్, స్వరూప, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిమ్మాపూర్: మండలంలోని ఇందిరానగర్‌లో ప్రియ డెయిరీలో సన్‌షైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి హాజరైన వారికి హాస్పిటల్ వైద్య సిబ్బంది పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యానికి సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. హాస్పిటల్‌లో నిరంతరం వైద్య సేవలు అందిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు అపూర్వ, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ సంతోశ్‌కుమార్, డెయిరీ డీజీఎం శ్రీనివాసరావు, సెక్షన్ మేనేజర్ మంజుల, హెచ్ఆర్, చిల్లింగ్ సెంటర్ మేనేజర్లు, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తి ప్రతిబింబించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న నాయకులు

తిమ్మాపూర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్ర అధికారిక చిహ్నం రూపొందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తల్లా నరేశ్ డిమాండ్ చేశారు. పార్టీ తరఫున ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ప్రతిపాదన నమూనా చిత్రాన్ని ఆమోదించాలని తిమ్మాపూర్ తహసీల్దార్ కనకయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. నమూనా ప్రతిపాదన చిత్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ఉస్మానియా యూనివర్సిటీ, సర్వాయి పాపన్నగౌడ్, సాయన్న, సమ్మక్క సారలక్క చిత్రాలున్నాయని తెలిపారు. అణగారిన వర్గాల పోరాటయోధుల స్ఫూర్తి ప్రతిబింబించేలా చిహ్నం రూపొందించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆరెల్లి బాబు, కవ్వంపల్లి నరసయ్య జిల్లాల సురేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

చొప్పదండి: శుభ కార్యాల్లో ఫొటోగ్రాఫర్లపై దాడులను నిరసిస్తూ మండల కేంద్రంలో మంగళవారం ఫొటోగ్రాఫర్‌ల యూనియన్ సభ్యులు నిరసన చేపట్టారు. శుభకార్యాలలో ఫొటోగ్రాఫర్లను సెల్ఫీ తీయాలని భౌతిక దాడులకు పాల్పడటం సమంజసం కాదన్నారు. యాదాద్రి జిల్లాలో ఫొటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడటాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బొడిగె అజయ్‌కుమార్, సామల కిషోర్, తేలుకుంట వేణు, సిరిపురం శ్రీనివాస్, తాటిపల్లి శివ, పెద్ది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యంత్రంతో సాగు.. దిగుబడి బాగు



వెదిరలో పత్తి విత్తనాలు విత్తడంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట శాస్త్రవేత్తలు, వ్యవసాయ పరిశోధనా స్థానం కరీంనగర్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో న్యూమాటిక్ ప్లాంటర్ యంత్రంతో పత్తి విత్తడంపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు మంజులత, వెంకటేశ్వర్‌రావు, మధుకర్, మదన్‌మోహన్ మాట్లాడుతూ.. యంత్రం ద్వారా సాలుకు సాలుకు మధ్య మూడు ఫీట్లు, మొక్కకు మొక్కకు మధ్య 15 సెంటీమీటర్లు వచ్చేలా ఎకరాకు ఐదు నుంచి ఆరు ప్యాకెట్లు అవసరం ఉంటుందని వివరించారు. యంత్రం ద్వారా సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. అధికారులు విజయ్, అంజలీ, సంపత్, రమేశ్, సంపత్, రాకేశ్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌తో అవకాశాలు పుష్కలం

హుజూరాబాద్‌రూరల్: ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ విభాగం ఫైనలియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు ఉద్యోగ సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఉద్యోగం వచ్చిన తర్వాత దూరం, జీతం తక్కువ అని భావించి ఉద్యోగంలో చేరకపోతే తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. మార్పులకు అనుగుణంగా విద్యార్థులు టెక్నాలజీ వైపు దృష్టి సారించాలని, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేసి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, ఈఈ విభాగాధిపతి యోగేశ్ పుండలిక్, అసోసియేట్ ప్రొఫెసర్ డి. వేణుగోపాల్, కళాశాల అకాడమిక్ ఇన్‌చార్జి జి. మల్లయ్య, మెకానికల్ ఇంజినీరింగ్ అధిపతి ఎంవీ సతీశ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌రావు, అధ్యాపకులు తదితరులున్నారు.



జమ్మికుంట: బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కేశవపట్నం, ధర్మారంలో ఎల్లమ్మ బోనాలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో మంగళవారం ఎల్లమ్మ జాతరర నిర్వహించారు. గౌడకులస్తుల ఆరాధ్య దైవం రేణుకా ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తరలివచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకొని పూజలుచేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, సదానందం, రాజకొంరయ్య, తిరుపతి, తదితరులున్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో గౌడ కులస్తులు శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి వార్షిక బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకుడు పైడిపల్లి ఆనందం, కౌన్సిలర్ బొంగోని వీరన్న, శ్రీనివాస్, అయోధ్య, బుర్ర సంపత్, గుర్రపు తిరుపతి, ఎల్లాగౌడ్, పైడిపల్లి మల్లికార్జున్, పొన్నం వెంకటరమణ, పెద్ద బీమయ్య, సదానందం, గట్టు సదయ్య, పంజాల రాజయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్యకర్తలు



మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

చిగురుమామిడి: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండలంలోని చిన్నముల్కనూర్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. హుస్నాబాద్-కరీంనగర్ ప్రధాన రహదారిపై కౌశిక్‌రెడ్డికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. మంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్న ముల్కనూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పూదరి వేణుగోపాల్ గౌడ్, సీనియర్ నాయకులు రాములు, ప్రభాకర్ రెడ్డి, మర్రి కొంరయ్య, ఇరుకుల్ల నందం, పైడిపెల్లి సతీశ్, బరిగెల మధుకర్, జంగం శేఖర్, నవీన్, వెల్డింగ్ రమేశ్ సాయిలు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయొద్దు

హుజూరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులపై ఆధారాలు లేకుండా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆరోపణలు చేస్తే సహించమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఫ్లైయాష్ స్కామ్ గూర్చి మంత్రి పొన్నంకు విసిరిన సవాల్‌కు తాను ఎక్కడైనా చర్చకు సిద్ధమేనన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్సీగా ఎన్ని అక్రమాలు చేశారో ప్రజలందరికీ తెలుసని, ఫ్లైయాష్ ట్రాన్స్‌పోర్ట్ వే బిల్లు ఉండదన్న కనీస జ్ఞానం లేదన్నారు. ఫ్లైయాష్ విషయంలో లారీ అసోసియేషన్ సభ్యులు వీడియో విడుదల చేశారని, ఎమ్మెల్యే ఇబ్బందులకు గురి చేయొద్దని ఆ వీడియోలో సభ్యులు పేర్కొన్నారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్ కుమార్, నాయకులు పొనుగంటి మల్లయ్య, కాజీపేట శ్రీనివాస్, మిడిదొడ్డి శ్రీనివాస్, రాజు, అమర్, కొలిపాక శంకర్,సొల్లు బాబు, పుష్పలత,లంకదాసరి లావణ్య,చందమల్ల బాబు,సమ్మెట సంపత్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న బాల వికాస సంస్థ ప్రతినిధులు

జమ్మికుంట: మహిళల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై పట్టణంలోని కేవీకే హాల్‌లో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల వికాస స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ దోవారి వసంత మాట్లాడుతూ.. మహిళల్లో ఋతుస్రావం సహజమైన ప్రక్రియ అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు మెనుస్ట్రవల్ కప్స్ ఉపయోగించాలని, ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. అనంతరం మెనుస్ట్రల్ కప్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కోఆర్డినేటర్ సుమలత, స్వాతి, కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి ,మహిళలు పాల్గొన్నారు.



వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో మంగళవారం వర్షాలు కురవాలని కప్పతల్లి ఆడారు. పిల్లలు రోకలి కర్రకు తెల్లటి వస్త్రంలో కప్పను కట్టి ఇంటింటికీ తిరుగుతూ పాటలు పాడారు. మహిళలు, ఇంటి యజమానులు కప్ప, పిల్లలపై నీళ్లను పోసి వర్షాలు కురవాలని కోరారు. – కరీంనగర్‌రూరల్